
జీడికల్ ఆలయంలో స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


బాణాపురంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీకం.. కమనీయం..

వివరాలు 8వ పేజీలో

- ఘనంగా పౌర్ణమి పర్వదిన వేడుకలు
- ఆలయాల్లో దీపాలు వెలిగించిన భక్తులు
- జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక సందడి


బుగులు వెంకన్న ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను జరిపిస్తున్న దృశ్యం

జనగామ కల్చరల్, నవంబరు 15: జిల్లాలో కార్తీక పౌర్ణమి పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జనగామ జిల్లా కేంద్రం లోని అన్ని దేవాలయాల్లో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 4.30 గంటల నుంచే మహాన్యాస ఏకాదశ పూర్వక రుద్రాభిషేకాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉదయం భక్తులు ఉసిరిక స్నానాలు చేసి, ఉసిరి కొమ్మను పూజించి, దీపారాధనలు నిర్వహించి, వత్తులు కాల్చారు. తులసి చెట్టకు పూజలు నిర్వహించి ఉసిరిక దీపాలు వెలిగించారు. జనగామ జిల్లా కేంద్రం లోని బాణాపురం, సంతోషిమాత దేవాలయం, గీతాశ్రమంలో లక్ష దీప మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పలహారాలు పంచిపెట్టారు.

జనగామ జిల్లా కేంద్రంలోని శివాలయంలో మహిళలు వేకువ ఝామునుంచే వత్తులు కాల్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు చేసేందుకు భక్తులు పోటెత్తారు. అదే విధంగా స్థానిక గీతాశ్రమంలో మహిళలు ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించి వత్తులు కాల్చి నిత్య సుమంగళిగా ఉండాలని మొక్కుకున్నారు. మూలబావి హనుమత్ రామనాథ సహిత శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ప్రధానార్చకులు మోహన కృష్ణ భార్గవ నేతృత్వంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవోపేతంగా నిర్వహించారు. 27వ వార్డు ఉప్పలమ్మ సహిత ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజారి వారణాసి పవన్‌శర్మ ఆధ్వర్యంలో 11 జంటలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. బాణాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ ప్రధానార్చకులు క్రిష్ణమాచార్య సిద్ధాంతి నేతృత్వంలో స్వామి వారికి ఉసిరిక స్నానం, సువర్ణ పుష్పాభిషేకం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

చీటకోడూరులో ...

అదేవిధంగా చీటకోడూరు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయమే స్వామి వారిని దర్శించుకొని అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద వత్తులు కాల్చి మహాదేవుని సేవించారు.

పోలీస్ శిక్షణలో ఉండగానే మరో ఉద్యోగం..


బాలకృష్ణ

బచ్చన్నపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగంలో అర్హత సాధించడంతో అందులో శిక్షణ పొందుతుండగానే, గ్రూప్-4 ఫలితాలు వెలువడడంతో అందులో అర్హత సాధించి రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యాడు. అయినప్పటికీ తన గోల్ గ్రూప్-1 రాసి మంచి ఉద్యోగం సాధించడమేనని మండలంలోని తమ్మడపల్లి గ్రామానికి చెందిన ఎలుగల బాలకృష్ణ తెలిపాడు.. 2022లో గ్రూప్-4 రాయగా, ఫలితాలు గురువారం వెలువడ్డాయి. బాలకృష్ణ తండ్రి చంద్రయ్య వ్యవసాయం చేసుకుంటూ కుమారున్ని చదివించాడని, పోటీ పరీక్షల్లో అత్యంత ప్రతిభ చూపుతూ అనుకున్న లక్ష్యం సాధిస్తాడని గ్రామస్థులు తెలిపారు.

పాలకుర్తిలో అఖండ జ్యోతి

పులకించిన భక్తజనం
దీపాలతో వెలిగిన సోమన్న ఆలయం
జ్యోతిని వెలిగించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి. ఉత్తర కాశి పీఠాధిపతి




అఖండ జ్యోతిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, శ్రీ స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతీ


పాలకుర్తి గుట్ట వద్ద లక్ష దీపోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి అఖండ జ్యోతి భక్తులకు దర్శనమిచ్చింది. అంతకు ముందు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డితో కలిసి ఉత్తర కాశి పీఠాధిపతి స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతీ అఖండ జ్యోతి ప్రజ్వలన చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు గుట్ట చుట్టూ కలశంతో ప్రదర్శన నిర్వహించారు. మొదట సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామికి పూజలు నిర్వహించారు. గుడివాడ చౌరస్తాలోని పంచగుళ్ల వద్ద ఉన్న కోనేరులో స్నానమాచరించి ఈ ఉత్సవంలో పాల్గొన్నారు దేశంలో అఖండ జ్యోతి దర్శనమిచ్చే ఆలయాలు కేరళ రాష్ట్రంలోని శబరిమలై, తమిళనాడులోని అరుణాచలం, తెలంగాణలోని పా లకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలని అన్నారు. ఈ ఆలయానికి ప్రత్యేక చరిత్ర ఉందని, ఈ క్షీరగిరి శివ స్వరూపమే, ఈ గిరిపై ఉన్న ఒక్కొక్క శిల ఒక్కొక్క శివలింగ స్వరూపమే. ఈ ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి చర్యలు చేపడుతుందన్నారు. జనగామ డీసీపీ రాజామహేంద్రనాయక్ దంపతులు స్వామి వారికి పూజలు చేశారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం. వెంకటలక్ష్మీ, ఆలయ ఈవో మోహన్‌బాబు, సిబ్బంది వెంకటయ్య, రాములు, పూజారులు డీవీఆర్ శర్మ, అనిల్ శర్మ, రామన్న పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పారా మెడికల్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జనగామ ప్రభుత్వ వైద్య కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను డిప్లొమా ఇల్ మెడికల్ ఇమేజింగ్ టెక్నిషియన్ కోర్సు, ఆప్తాలమిక్ అసిస్టెంట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. బైపీసీ, ఎంపీసీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ నెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కొరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీఎంసీజనగామ.ఓఆర్‌జీ వైబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

కొండపై ఎలుగుబంట్ల సంచారం


దేవుని కొండపై మెట్ల సమీపంలో సంచరిస్తున్న ఎలుగుబంటి

జఫర్‌గడ్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం జఫర్‌గడ్ దేవుడి కొండపై ఎలుగు బంట్ల సంచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జఫర్‌గడ్ చుట్టూ కొండలు ఉండడంతో ఎలుగుబంట్లు నివాసం ఏర్పరు చుకుని సంచరిస్తున్నాయి. తాజాగా శుక్రవారం ఉదయం వేళ జఫర్‌గడ్‌లోని రామాలయం వెనుక గల దేవుడి కొండపై గల మెట్ల సమీపంలో స్థానికులకు ఓ ఎలుగుబంటి సంచరిస్తూ కనిపించింది. పెద్దగా అరుస్తూ తరిమేయడంతో కొండపై గుహల్లోకి వెళ్లిపోయిందని తెలిపారు. కొండ దిగువ ప్రాంతానికి రాత్రి వేళల్లో తరచుగా ఎలుగుబంట్లు సంచరిస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. రాత్రి వేళల్లో కొండ దిగువ ప్రాంత ఇళ్లకు, పంట క్షేత్రాలకు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు.. అటవీ శాఖ అధికారులు స్పందించి ఎలుగుబంట్ల స్థావరాలను గుర్తించి వాటిని బంధించాలని కోరుతున్నారు.

బిర్సా ముండా జయంతి వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

జనగామ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ధర్తి ఆబా భగవాన్ బిర్సా ముండా 150 వ జయంతి, గిరిజన గౌరవ దినోత్సవ సమారోహం వేడుకలు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, గౌరవ దినోత్సవ సమారోహం సభను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన జాతి ఆత్మ గౌరవం ఇనుమడింపజేసిన వ్యక్తి బిర్సా ముండా అని, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి ప్రేమకళ, ఏఈవో రామారావు నాయక్, డీఈవో రాము, తదితరులు పాల్గొన్నారు.

అడవి బిడ్డలకు అండగా..


పాలకుర్తి మండలంలో మైలారం గ్రామ వ్యూ




నర్మెట్ట మండలంలోని మల్కాపేట గ్రామ వ్యూ

- 'దర్తీ ఆబ జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్' కు కేంద్రం శ్రీకారం
- గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు కల్పనకు ఆస్కారం
- జిల్లాలో 6 మండలాల్లో 9 గ్రామాలు ఎంపిక
- నిధుల కోసం త్వరలోనే ప్రతిపాదనలు

జనగామ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న గిరిజనుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు గానూ కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. దేశంలోని గిరిజనులందరూ మిగతా పౌరుల మాదిరిగానే అన్ని రకాల హక్కులు, సౌకర్యాలు పొందేందుకు గానూ ఓ కొత్త కార్యక్రమానికి 'ప్రధానమంత్రి దర్తీ ఆబ జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్' అనే ఓ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశంలో ఉన్న గిరిజన తెగల ప్రజలను సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేయాలని పీఎం నరేంద్రమోదీ సంకల్పించారు. ఈ క్రమంలోనే మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని అక్టోబరు 2న ఝార్ఖండ్ రాష్ట్రం హజారీబాగ్‌లో ఈ కార్యక్రమానికి నరేంద్రమోడీ శ్రీకారం చుట్టారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో..

దర్తీ ఆబ జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమం కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం అమలులో ఉన్న 21 కేంద్ర ప్రభుత్వ పథకాలను ఏకీకృతం చేయడంతో పాటు 17 మంత్రిత్వ శాఖలను ఒకే గొడుకు కిందకు తెచ్చారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న గిరిజనులకు నేరుగా ఫలాలు అందుతాయని పథకం ఉద్దేశ్యం. ఈ పథకం అమలులో అవసరమైన నిధుల్లో 70 శాతం కేంద్ర ప్రభుత్వం, 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. దేశవ్యాప్తంగా 226 రాష్ట్రాలు, 4 కేంద్రపాలిత ప్రాంతాల్లోని సుమారు 700కు పైగా ఉన్న గిరిజన తెగల అభివృద్ధి కోసం ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. దీనికోసం రూ.79,156 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. వీటితో దేశవ్యాప్తంగా 63 వేల గ్రామాల్లో 5 కోట్ల మంది గిరిజనులకు మౌళిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, జీవనోపాధులను కల్పించనున్నారు.

జిల్లాలో 7 మండలాలు ఎంపిక

ఈ కార్యక్రమం కింద జనగామ జిల్లాలోని ఆరు మండలాల్లో 9 గ్రామాలను కేంద్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఇందులో తరిగొప్పుల మండలంలోని బొంతగట్టునాగారం, నర్మెట్ట మండలం లోని బొమ్మకూరు, మల్కాపేట, చిల్పూరు మండలం లోని ఫతేపూర్, పాలకుర్తి మండలంలోని కొండాపూర్, మైలారం, దేవరుప్పుల మండలంలోని మాదాపురం, ధర్మాపురం, కొడకండ్ల మండలంలోని మొండ్రాయి గ్రామాలు ఎంపిక అయ్యాయి. గిరిజనుల జనాభా, మౌళిక సదుపాయాల లేమి, ఇంకా మెరుగుపరచాల్సిన పరిస్థితి ఉన్న కారణంగా ఈ గ్రామాలను కేంద్రం మెదటి విడతలో ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. కాగా.. విడతల వారీగా గిరిజన ప్రాబల్యం ఉన్న మిగతా గ్రామాలను కేంద్రం ఎంపిక చేయనుంది. జిల్లాలో 12 మండలాల పరిధిలో సుమారు 62,300 మంది గిరిజన జనాభా ఉంది.

ఈ పథకంలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన మండలాల్లో గిరిజన ప్రాబల్యం ఉన్న గ్రామాలను గుర్తిస్తారు. గుర్తించిన గ్రామాల్లో ఏయే రకమైన మౌళిక సదుపాయాలు కల్పించాలన్న దానిపై ప్రతిపాదనలు తయారు చేస్తారు. గిరిజనులకు విద్య, వైద్యానికి కావాల్సిన పాఠశాలలు, ఆసుపత్రులు అందు బాటులో ఉన్నాయా లేవా అన్న అంశాలను సేకరి స్తారు. ఉపాధి కల్పన కోసం తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలను అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించి గ్రామంలోని గిరిజనుల నుంచి అభిప్రాయాలు, వినతులను అధికారులు స్వీకరిస్తారు. కలెక్టర్ ద్వారా నిధుల కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తారు.

మండలాల వారీగా ఎంపికైన గ్రామాలు, కుటుంబాలు, జనాభా వివరాలు

మండలం	గ్రామాలు	మొత్తం జనాభా	గిరిజన జనాభా	గిరిజన జనాభా శాతం
తరిగొప్పుల	బొంతగట్టునాగారం	3191	1992	62.43
నర్మెట్ట	బొమ్మకూరు	1255	695	55.38
	మల్కాపేట	1262	1005	79.64
చిల్పూరు	ఫతేపూర్	484	1873	75.40
పాలకుర్తి	కొండాపూర్	2533	1916	75.64
	మైలారం	687	678	98.69
దేవరుప్పుల	మాదాపురం	4238	3200	75.51
	ధర్మాపురం	3550	2586	72.85
కొడకండ్ల	మొండ్రాయి	5465	3366	61.59



ములుగులో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బలరాంనాయక్

'గోర్ మళావో' కరపత్రం ఆవిష్కరణ

ములుగు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుడితండాలో ఈనెల 24, 25 తేదీల్లో జరిగే గోర్ మళావో కార్యక్రమ కరపత్రాన్ని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ ములుగులో శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏక్‌వాత్, ఏక్‌జాత్, ఏక్ సాత్ అనే నినాదంతో సేవాలాల్ మేరమ్మయాడీ చూపిన మార్గంలో బంజారాలు కలిసి కట్టుగా తమ ఆశయాల కోసం పని చేయాలన్నారు. గోర్ మళావో కార్యక్రమంలో బంజారాలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, సేవాలాల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పోరిక సునీల్‌నాయక్, నాయకులు బోడ కిషన్, పోరిక రాహుల్, పాల్తియా సారయ్య, రాజ్‌కుమార్, శ్యామల్‌నాయక్, వినయ్, రాజు, సంతోష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

15 క్వింటాళ్ల
పీడీఎస్ బియ్యం పట్టివేత

చిలుపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా 15 క్వింటాళ్ల పీడీఎస్ (రేషన్) బియ్యం తరలిస్తున్న మూడు ప్యాసింజర్ ఆటోలను పట్టుకుని, వాటి యాజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం... హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని మడికొండ, రాంపూర్‌కు చెందిన వల్లెపు రమేష్, పొట్లబత్తిని రమేష్, ఆలకుంట రాజు అనే ముగ్గురు వ్యక్తులు ఎవరికీ అనుమానం రాకుండా ఉదయం పూట ప్యాసింజర్ల కోసం ఆటో నడుపుతూ, రాత్రుళ్ళు పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారు. కాగా, గురువారం సాయంత్రం మూడు ఆటోలలో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేపట్టామన్నారు. పట్టుకున్న బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించి, ఆటోలను సీజ్ చేసి, ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నాలుగో తరగతి ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్

ములుగు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని నాలుగో తరగతి ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోత్ రమేష్ ఆధ్వర్యంలో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రాకు వినతిపత్రం అందజేశారు. ములుగు మండలంలోని జాకారం వైటీసీలో జరిగిన కార్యక్రమంలో పీవోను కలిశారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతోపాటు కాంటిజెంట్ ఉద్యో గులను రెగ్యులర్ చేయాలని, వారికి దినసరి వేతనం నెలనెలా వచ్చేవిధంగా చూడాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు నెలనెలా ఇవ్వాలని కోరారు.



ఐటీడీఏ పీవో చిత్రమిశ్రాకు సమస్యలను వివరిస్తున్న ఉద్యోగులు



లక్ష్మీనర్సింహాస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కందగిరి ఆలయంపై అఖండ జ్యోతి



ఆలయం వద్ద జన సందోహం

కన్నుల పండువగా.. లక్ష్మీనర్సింహాస్వామి కల్యాణం

ఉదయం 4 గంటల నుంచి 5.30 వరకు పూర్తి

కురవి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని కురవి మండలం కందగిరి పర్వతంపై లక్ష్మీనర్సింహాస్వామి కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. వల్మీకి (పుట్ట) రూపంలో ఉన్న లక్ష్మీనర్సింహాస్వామికి ఎదురుగా అర్చకులు చిత్రపటాలను ఉంచి వివాహతంతును జరిపించారు. వందల ఏళ్ల నుంచి ఈ వివాహమహోత్సవం స్వామివారికి నిర్వహిస్తున్నట్లు అర్చకుడు నల్లప్రోల్ పురుషోత్తమాచార్యులు తెలిపారు. స్వామివారికి శుక్రవారం తెల్లవారుజామున సుప్రభాతసేవ అనంతరం ఆలాపన, అర్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు రామానుజాచార్యులు, నర్సింహాచార్యులు, కృష్ణామాచార్యులు స్వామి వారి చిత్రపటాలకు కోనేరులో స్నానమా చరించి, ఉదయం 4గంటలకు బ్రహ్మ ముహూర్తంలో కళ్యాణం ప్రారంభించారు. ఆలయ ధర్మకర్తలు స్వామివారికి వస్త్రాలు సమర్పించగా, అనంతరం పూజాకార్యక్రమాలను అర్చకులు కొనసాగించి 5.30 గంటలకు కల్యాణాన్ని పూర్తి చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను పంచి భక్తుల దర్శనార్థం స్వామివారిని ఉంచారు.

ఆకట్టుకున్న అఖండజ్యోతి..

శుక్రవారం సాయంత్రం గుట్టపై ఉన్న ఆలయం పైభాగంలో అఖండ జ్యోతిని వెలిగించారు. మట్టి మూకుడులో కందికొండ ఆలయంపై భాగాన అఖండజ్యోతిని వెలిగించారు. ఈ మూకుడు నిండా నూనెపోసి, వస్త్రముతో మడతవేసి, పెద్దవత్తిగా చేసి వెలిగించారు. ఈ దీపంలో నూనెను కందికొండ గ్రామానికి చెందిన ముస్లింలు అందించడం విశేషం. ఈ దీపం గుట్ట నుంచి 40 కిలోమీటర్ల దూరం వరకు కనిపించింది. తరతరాలుగా ముస్లింలు నూనెలు అందించడం ఆచారంగా వస్తోంది.

కందికొండకు కార్తీక సోయగం

- భక్తజనంతో రద్దీగా కందగిరి పర్వతం
- వెల్లువలా తరలి వచ్చిన జనం



కందగిరి మెట్ల వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్

కురవి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కందికొండ పర్వతంపై శుక్రవారం జరిగిన శ్రీలక్ష్మీనర్సింహాస్వామి జాతరకు భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా జనం తరలిరావడంతో పర్వత పరిసర ప్రాంతాలు రద్దీగా మారా యి. నర్సింహాస్వామి, లక్ష్మీదేవిల కల్యాణానికి హాజరై స్వామివారిని దర్శించుకోవడంతో కందగిరి భక్తజనంతో నిండుకుండగా మారింది. శుక్రవారం కార్తీకపౌర్ణమి కావడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు కందికొండకు తరలివచ్చి, సుమారు మూడు కిలోమీటర్ల ఎత్తులోని పర్వతాన్ని అధిరోహించారు. గుట్టపై పుష్కరిణి (కోనేటి)లో స్నానం చేసి, లక్ష్మీనర్సింహుడి ఆల యంలో మొక్కులు తీర్చుకున్నారు. తిరుగు ప్రయాణంలో మొదటిగుట్టపై ఉన్న గుహ వేంకటేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు.

జాతరకు పోటెత్తిన జనం..

ఈ సారి కందికొండ జాతరకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. గిరిజన భక్తులతో సహా, గిరిజనేతరులు సైతం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ఆటోలు, ద్విచక్రవాహనాలపై ఈ సారి అధికంగా తరలివచ్చారు. కాలినడకన వచ్చే భక్తులు పూర్తిగా కనుమరుగు అయ్యారు. కందగిరి వద్ద జాతరలో దుకాణాలు, వనమూలికలతో కోయవారు, పాతకొత్త రకం దుకాణాలతో భిన్న సంస్కృతులు కనిపించాయి. గుట్టను అధిరోహించిన భక్తులు ఉసిరిచెట్ల ఆకులు, ఇతర వనమూలికలు, కోనేటి నీటిని వెంట తెచ్చుకున్నారు.

భారీ బందోబస్తు..

జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మహబుబాబాద్ డీఎస్పీ కృష్ణకిషోర్ నేతృత్వంలో ఏడుగురు సీఐలు, 20మంది ఎస్సైలు బందోబస్తును పర్యవేక్షించారు. తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీవో వీరబాబు, ఎంపీవో గౌస్, ఏపీవో ఏకాంబ్రం ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం మొత్తం జాతర విధులు నిర్వహించారు. జాతరలో బలపాల, కురవి పీహెచ్‌సీ వైద్యులు ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. తాగునీటికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా జాతరలో బోర్లు, వేయించడంతో పాటు, ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు.

ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ ప్రత్యేక పూజలు

ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ గుట్టక్రింద మెట్ల వద్ద ఆయన సతీమణి ప్రమీలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కిసాన్‌పరివార్ సీఈవో వివేక్, కాంగ్రెస్ నాయకులు అంబటి వీరభద్రం, బండి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి, యుగంధర్‌రెడ్డి, కోర్ని రవీందర్ రెడ్డి, కాలం రవీందర్‌రెడ్డి, అవిరె మోహన్‌రావు, బాలగాని శ్రీనివాస్ ఉన్నారు.

కందికొండను పర్యాటక కేంద్రంగా చేసేందుకు కృషి

కురవి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీనర్సింహస్వామి వెలిసిన కందికొండను పర్యాటక కేంద్రంగా చేసేందుకు కృషి చేస్తామని డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్, రాష్ట్ర పర్యాట కశాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. కందికొండలోని కందగిరి పర్వతాన్ని శుక్రవారం సందర్శించి, మెట్లవద్ద పూజలు జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందికొండ విశిష్టతను సీఎం రేవంత్‌రెడ్డికి తెలిపి, ఈ క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిధులు తీసుకువస్తామన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో జ్వాలాతోరణం

కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో జాటోతు రాంచందర్‌నాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, పటేల్ రమేష్‌రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు మాలోతు నెహ్రూనాయక్ జ్వాల తోరణ పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. ఆలయంలో శివలింగ ఆకారంలో ఏర్పాటు చేసిన కార్తీక దీపోత్సవంలో పాల్గొని ప్రమిదలను వెలిగించారు. ఆయా కార్యక్రమాల్లో కురవి దేవాలయ చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం, ఇస్లావత్ సుధాకర్‌నాయక్, అవిరె మోహన్‌రావు, బాలగాని శ్రీనివాస్, బాదె వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



జ్వాలతోరణ పూజలో పాల్గొన్న విప్ రాంచందర్‌నాయక్, రాష్ట్ర పర్యాటకశాఖ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి

దోష నివారణ పేరుతో కుచ్చుటోపీ

- రూ.55 లక్షలు కాజేసిన ట్రాన్స్‌జెండర్
- జనగామ జిల్లాలో ఘటన.. కేసు నమోదు

జనగామ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మీ ఇంట్లో దోషం ఉందని, అది తొలగాలంటే దోష నివారణ పూజలు చేయాలంటూ ఓ మహిళ, ఆమె తమ్ముడికి ఓ ట్రాన్స్‌జెండర్ కుచ్చుటోపీ పెట్టింది. వారి బలహీనతను ఆసరాగా తీసుకున్న సదరు ట్రాన్స్‌జెండర్ శాంతి పూజలు పేరుతో ఏకంగా రూ.55 లక్షల వరకు వసూలు చేసింది. ఈ ఘటన జనగామ జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగు చూసింది. సీఐ దామోదర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జనగామలోని వెంకన్నకుంటకు చెందిన ఉప్పల సిరివెన్నెలకు జనగామకే చెందిన నిరోష అనే స్నేహితురాలి ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం సత్యానారాయపురం గ్రామానికి చెందిన నాగదేవి అనే ట్రాన్స్‌జెండర్ పరిచయం అయింది. ఈ ఏడాది జూన్ నెలలో జనగామకు వచ్చిన నాగదేవిని సిరివెన్నెల కలిసి తన కుటుంబ పరిస్థితి గురించి వివరించింది. మీ ఇంట్లో దోషం ఉందని, అది తొలగాలంటే పూజలు చేయాలని నమ్మించింది. దీనికి పెద్ద మొత్తంలో డబ్బులు అవసరమవుతాయని చెప్పింది. ఈ విషయాన్ని సిరివెన్నెల మేడ్చల్‌లో ఉంటున్న తన తమ్ముడైన నిఖిల్‌కు వివరించింది. దీంతో ఓసారి జనగామలో, ఓసారి మేడ్చల్‌లోని నిఖిల్ ఇంటికి నాగదేవి వచ్చి పూజలు చేసింది. పలు దఫాలుగా మొత్తం రూ. 55 లక్షల వరకు బాధితుల నుంచి వసూలు చేసింది. రూ.13 లక్షలు క్యాష్ రూపంలో, మిగతావి ఫోన్‌పే, అకౌంట్‌పే రూపంలో చెల్లించారు. కాగా.. పూజలు చేసి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ ఇంట్లో పరిస్థితులు చక్కబడకపోవడంతో బాధితులు సిరివెన్నెల, నిఖిల్ ఈనెల 13న నాగదేవి జనగామకు వచ్చిన విషయాన్ని తెలుసుకొని వెళ్లి నిలదీశారు. మోసపోయామని గ్రహించి అదే రోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా.. ఈ విషయంపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

గంజాయి తాగుతున్న విద్యార్థులపై కేసు

హసన్‌పర్తి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి తాగుతున్న నలుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్న హసన్‌పర్తి పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వట్టే చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నగర శివారులోని ఓ ఇంజనీరింగ్ కళాశాల బాలుర హాస్టల్ వెనుక కొందరు విద్యార్థులు గంజాయి తాగుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ శీలం రవి సిబ్బందితో చేరుకొని తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో గంజాయి తాగుతూ కనిపించిన నలుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద 24 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ చేరాలు వెల్లడించారు. గంజాయి తాగేందుకు ఉపయోగించిన బాటిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

జోనల్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

కాటారం, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) కాళేశ్వరం జోనల్ మీట్‌లో భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దామెరకుంట ఎస్సీ బాలికల గురుకులం విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. కబడ్డీ అండర్-14, షాట్‌పుట్ అండర్-14 విభాగంలో సృజన, డిస్కస్ త్రోలో హరిప్రియ జోనల్ ద్వితీయ స్థానం సాధించి తమ సత్తా చాటారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ మానస తెలిపారు.

ఈ విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, పీడీ అమ్మాజీ, పీఈటీ రాజేశ్వరి, టీజీపీఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కందుగుల రాజన్న, అధ్యాపకులు అభినందించారు.



షీల్డులు అందుకుంటున్న విద్యార్థినులు

వృద్ధురాలికి అండగా నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం

రేకుల ఇంటిని ప్రారంభించిన నాయకులు



రేకుల ఇంటిని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోవిందరావుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో కురిసిన అధిక వర్షాలకు మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన సగులూరి వెంకటమ్మ అనే వృద్ధురాలి ఇంటి గోడలు కూలిపోయి నిరాశ్రయురాలిగా మిగిలిపోయింది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లగా ఇంటి మరమ్మతుల నిమిత్తం రూ.16వేలను మంజూరు చేశారు. దీంతో స్థానిక నాయకులు ఇంటి పైకప్పుగా రేకులు వేయించి ఉండడానికి ఆశ్రయం కల్పించారు.

ఈమేరకు శుక్రవారం మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కళ్యాణి, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణలు రేకుల ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటమ్మను అన్నివిధాలుగా ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌పే చేశానని బురిడీ

- మోసానికి గురైన పంక్చర్‌షాపు నిర్వాహకుడు
- వాదనతో ఏమార్చిన ఆగంతకుడు

కేసముద్రం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : టైర్లను కొనుగోలు చేసిన డబ్బులను ఫోన్‌పే చేశాన ని చెప్పి ఆగంతకుడు వెళ్లిపోయిన ఘటన కేసముద్రంలో చోటు చేసుకుంది. స్థానిక అంబేద్కర్ సెంటర్ సమీపంలో టైర్ పంక్చర్ షాపు నిర్వాహకుడు సుందర్ వెంకన్నకు టైర్లు విక్రయించే షాపు కూడా ఉంది.

గురువారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి షాపు వద్దకు వచ్చి తన బైక్ రెండు టైర్లు మార్చాలని కోరడంతో రూ.3800 అవుతుందని సుందర్ వెంకన్న తెలిపారు. ఆపై టైర్లను మార్చిన అనంతరం ఫిట్టింగ్ చార్జీ వంద కలిపి రూ.4000లు ఇవ్వాలని సుందర్ వెంకన్న కోరాడు. దానికి ఆగంతకుడు రూ.3800 ఫోన్‌పే చేశానని తెలుపడంతో ఫిట్టింగ్ చార్జీ రూ.200ల విషయంలో ఇరువురి మధ్య వాదన జరిగింది. చివరకు రూ.100 రేపు ఇస్తానని చెప్పి ఆగంతకుడు బైక్‌ను తీసుకు వెళ్లిపోయాడు.

శుక్రవారం ఉదయం తన ఫోన్‌పే చెక్ చేసుకుంటే అసలు రూ.3800లు కూడా సుందర్ వెంకన్నకు రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి కంగుతిన్నాడు. ఫిట్టింగ్ చార్జీ చెల్లింపులో కావాలనే వాదన పెట్టుకొని డబ్బుల విషయంలో దృష్టి మళ్లించి మోసం చేశాడని పలువురు భావిస్తున్నారు.



బాధితుడు వెంకన్న

రామప్పను సందర్శించిన ప్రముఖులు

వెంకటాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని పలువురు ప్రముఖులు శుక్రవారం సందర్శించారు. మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి జ్ఞానేష్‌భారతి, పీసీసీఎఫ్ సునీత భగవత్ స్వామి వారిని వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, పూజారులు వారిని సాదరంగా స్వాగతం పలికారు. పూజల అనంతరం జ్ఞానేష్‌భారతి, సునీత ఆలయ శిల్పకళా సంపదను వీక్షించారు. ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్ ద్వారా తెలుసుకున్నారు. జ్ఞానేష్‌భారతి వెంట డైరెక్టర్లు సంబల్, భాస్కర్ తదితరులు ఉన్నారు.



ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న జ్ఞానేష్ భారతి,



రామలింగేశ్వర ఆలయంలో హారతి స్వీకరిస్తున్న సునీత భగవత్

కార్తీకం.. నేత్రపర్వం..

పౌర్ణమి వేళ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పూజలు

- దీపాలు వెలిగించిన మహిళలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు


వేయి స్తంభాల ఆలయంలో క్యూలో వేచియున్న భక్తులు


పౌర్ణమి చంద్రుడికి దీపాలు చూపుతున్న యువతులు



కార్తీక పౌర్ణమి వేళ చారిత్రక ఓరుగల్లులోని శివాలయాలతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాలు, శైవక్షేత్రాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి.
శుక్రవారం తెల్లవారుజాము నుంచే శివుడికి ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలతో సందడి కనిపించింది. మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం సమయంలో దీపోత్సవాలు నేత్రపర్వంగా సాగాయి. హనుమకొండలోని ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయంతో పాటు పలు ఆలయాలు దేదీప్యమానమై వెలుగొందాయి. శివుడికి ప్రీతికరమైన కార్తీక పర్వదినాన స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఈ క్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల వద్ద పటిష్ఠ ఏర్పాట్లు చేశారు.


రామప్ప ఆలయం ఆవరణలో శివలింగం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు


కాళేశ్వరం వద్ద గోదావరి తీరంలో భక్తుల రద్దీ


కాళేశ్వరం వద్ద గోదావరిలో నూనె దీపాలు వదులుతున్న మహిళలు


కాళేశ్వరాలయంలో అఖండ దీపానికి మొక్కుతున్న యువతి


మహబూబాబాద్ వేణుగోపాలస్వామి ఆలయంలో పుష్పార్చన చేస్తున్న మహిళలు

భద్ర 'ఖాళీ'

నీటి తరలింపుతో బోసిపోయి కనిపిస్తున్న చెరువు


నీరంతా పోవడంతో ఖాళీగా, బోసిపోయి కనిపిస్తున్న భద్రకాళి చెరువు


మిగిలిన నీళ్లలోని చేపలను పడుతున్న మత్స్యకారులు

హనుమకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరం నడిబొడ్డున్న చారిత్రకంగా ఎంతో సుప్రసిద్ధమైన భద్రకాళి చెరువులోని నీళ్లన్నీ ఖాళీ అయ్యాయి. భద్రకాళి చెరువులోని పూడికను తీసి వేసి నీటి నిలువ సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా లోతు చేసేందుకు, చెరువులోని గుర్రపు డెక్క, నాటు, ఇతర వ్యర్థ పదార్థాలను తొలగించి పరిశుభ్రం చేసేందుకు వారం కిందట చెరువులోని నీళ్లను నీటి పారుదల శాఖ ఖాళీ చేస్తోంది.

చెరువులోని నీరంతా దాదాపు ఖాళీ అయింది. అక్కడక్కడా ఇంకా నీరు మిగిలి ఉంది. ఆ నీటిలోని చేపలను మత్స్యకారులు పట్టుకుంటున్నారు. చెరువు ఖాళీ కావడంతో బోసిపోయి కనిపిస్తోంది. అంతకు ముందు సంవత్సరం పొడవునా నీటితో చెరువు కళకళాడుతూ ఉండేది. భద్రకాళి గుడికి వచ్చే భక్తులకు కనువిందు చేసేది. సుమారు దశాబ్దన్నర కిందట వేసవి కాలంలో పూర్తిగా చెరువు ఎండిపోయింది. అప్పుడు చెరువు మధ్యలో ఉన్న చిన్నమట్టి దిబ్బ వద్ద కొన్ని దేవతా శిల్పాలు లభించాయి.

వాటిని పురావస్తుశాఖ స్వాధీనం చేసుకొని మ్యూజియంలో భద్రపరిచింది. నీళ్లు ఖాళీ అయి ఇప్పుడు ఖాళీగా కనిపించడం రెండోసారి. చెరువులో నీళ్లున్నప్పుడు పర్యాటక శాఖ బోట్లను నడిపేది. ప్రస్తుతం నీళ్లు లేకపోవడంతో బోటింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసింది. చెరువు పూర్తిగా ఎండిపోయిన తర్వాత పూడికతీత పనులు మొదలు పెడతారు. చెరువులో పూడికను తొలగిస్తున్నప్పుడు గతంలో మాదిరిగానే దేవతా ప్రాచీన శిల్పాలు, దేవతా మూర్తుల విగ్రహాలు లభించే అవకాశం లేకపోలేదని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు.

ఎనిమిది కొలువులు కొట్టిన యువకుడు

తన దారిలోనూ తమ్ముడు.. ఒక ఉద్యోగానికి ఎంపిక

నల్లబెల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని జయించారు. తమ తల్లిదండ్రులు పడిన కష్టాన్ని ప్రతిఫలంగా ప్రభుత్వ ఉద్యోగాలను పొందారు ఆ అన్నదమ్ములు. వారిలో అన్న ఏకంగా ఎనిమిది ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికవగా.. అన్నను స్ఫూర్తిగా తీసుకున్న తమ్ముడు ఒక కొలువుకు ఎంపికయ్యాడు. అలా చదువులో సత్తా చాటి అందరి మన్ననలు అందుకున్నారు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన రాయరాకుల రాజేశ్, సంతోష్. నల్లబెల్లి గ్రామానికి చెందిన రాయరాకుల సాంబయ్య, సుగుణ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సాంబయ్య చాకలి వృత్తిని కొనసాగిస్తుండగా.. సుగుణ కూలి పనులకు వెళ్తూ కుమారులను చదివించారు.

తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించిన కుమారులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. పెద్దకుమారుడు రాజేష్ 10వ తరగతి నల్లబెల్లిలోని ఉదయశ్రీ హైస్కూల్, ఇంటర్ నర్సంపేటలోని కాకతీయ కాలేజీ, డిగ్రీ ఆచార్య కాలేజీ, పీజీ ఉస్మానియా యూనివర్సిటీలో చదివాడు. అనంతరం అదే ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీలో ప్రభుత్వ కొలువులకు ప్రిపేర్ అయ్యాడు.


ఆనందాన్ని తల్లిదండ్రులతో పంచుకుంటున్న రాజేష్, సంతోష్

మొదటి కొలువు పంచాయతీ కార్యదర్శిని సాధించాడు. అదే స్ఫూర్తితో ఏఎస్‌వో, గురుకుల పీజీటీ, టీజీటీ గురుకుల, హాస్టల్ వేల్ఫేర్ గ్రేడ్ 2, గ్రూప్ 4, డీఎస్సీ, జేఎల్ ఇలా 8 ప్రభుత్వ కొలువులను సాధించాడు. ప్రస్తుతం పీటీజీ గురుకులం అడవి మల్లంపల్లిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆ తర్వాత తన అన్న స్ఫూర్తి, ఇచ్చిన సలహాలతో సంతోష్ కూడా బీటెక్ పూర్తి చేసి నల్లబెల్లి గ్రంథాలయంలో చదువుతూ గ్రూప్ 4ను సాధించాడు. గ్రూప్ వన్ ప్రిలిమ్స్ క్వాలిఫై అయి మెయిన్స్ ఎగ్జామ్ కూడా రాసి ఫలితాల కోసం వేచి చూస్తున్నాడు.

ఇద్దరు అన్నదమ్ములు ప్రభుత్వ కొలువుల్లో సత్తా చాటుతుండడంతో వారి తల్లిదండ్రులు మురిసిపోతున్నారు. ప్రజలు, స్నేహితులు, బంధువుల నుంచి వారికి అభినందనల వెల్లువెతుతున్నాయి. నేటి యువతకు ఈ ఇద్దరు అన్నదమ్ములు ఆదర్శమని సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి.

గో హత్యలు ఆపి, ప్రకృతిని కాపాడుకుందాం

- సనాతన ధర్మ రక్షణకు పర్యటిస్తున్నా
- వర్ధన్నపేటలో అఘోరీ నాగసాధు
- స్త్రీల జోలికొస్తే అంగాన్ని కోస్తా అంటూ సంచలన వ్యాఖ్యలు

వర్ధన్నపేట రూరల్/ శంభునిపేట / వరంగల్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గోహత్యలు ఆపి.. ప్రకృతిని కాపాడుకుందామని, ఆడపిల్లలను రక్షించుకోవాలని అఘోరీ నాగసాధు పేర్కొన్నారు. ఇటీవల పలు సంచలన వ్యాఖ్యలు చేసి వార్తల్లోకెక్కిన అఘోరి.. శుక్రవారం వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికొచ్చారు. ఈ క్రమంలో కాలభైరవస్వామి ఆలయాన్ని సందర్శించాలని ఆ ఆలయ పూజారి రాము కోరడంతో అఘోరీ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రజలకు బొట్టు పెడుతూ దీవెనలందించిన అఘోరి.. సంచలన వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మాన్ని రక్షించుకోవడానికి తాను రాష్ట్రంలో పర్యటిస్తున్నాన్నారు. స్త్రీలను ముట్టుకోవాలంటే గజగజలాడాలని, అలాంటి విపత్తు రాబోతోందని, స్త్రీల జోలికి వస్తే అంగాన్ని కోస్తానని, త్వరలోనే ఒకరి అంగాన్ని కోయబోతున్నానని వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది. తనకు లోకజ్ఞానం చాలా తక్కువని, ఎక్కువగా హిమాలయాల్లో ఉండడం వలన ఇక్కడి విషయాలు తెలియవన్నారు. ప్రజారంగంలోకి వచ్చిన తర్వాత నేర్చుకుంటున్నట్లు వివరించారు. అనంతరం ఆలయ ఆవరణలో నేలపై కూర్చొని విస్తరాకు లేకుండానే మట్టిపై అన్నం, పప్పు, చారు కలుపుకొని భుజించారు.

అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తాను అన్నం తినబోనని శవాలనే తింటానని స్పష్టం చేసిన అఘోరీ ఇలా నేలపై అన్నం తినడం చర్చనీయాంశమైంది.

మామునూరు శ్మశానంలో..

వర్ధన్నపేట మండలం ఇల్లందులోని కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అఘోరి మామునూరు శ్మశానవాటికకు చేరుకున్నారు. లోపలికి ఎవరూ రావద్దని, తాను కార్తీక పౌర్ణమి పూజలు చేసుకుంటానని చెప్పి లోపలికి వెళ్లగా.. అఘోరీని చూసేందుకు వచ్చిన వారితో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మామునూరు పోలీసులు వెంటనే బందోబస్తు నిర్వహించారు. శ్మశానంలో పూజల తరువాత బయటకు వచ్చిన అఘోరీ మాట్లాడుతూ.. లోక కల్యాణం కోసం ప్రత్యేక పూజలు చేశానన్నారు. ఆలయాలపై దాడులు, మహిళలపై అత్యాచారాలు, గోహత్యలు పెరిగాయని, ధర్మం గాడి తప్పుతోందని అన్నారు. అనంతరం పాదయాత్రగా రంగశాయిపేట, శంభునిపేట, ఖిలావరంగల్ పెట్రోల్ పంపు, బట్టల బజార్ మీదుగా భద్రకాళి ఆలయానికి చేరుకున్నారు.


ఇల్లందలో కాలభైరవునికి హారతి ఇస్తున్న అఘోరీ నాగసాధు

పాదయాత్రలో అఘోరీతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ తూర్పు నుంచి పోటీ చేసిన పుష్పిత లయ, హిజ్రాలు, ప్రజలు పాల్గొన్నారు. అలా భద్రకాళి ఆలయానికి చేరుకున్న అఘోరి అమ్మవారిని దర్శించుకునేందుకు దిగంబరంగా ఆలయంలోకి వెళుతుండగా అధికారులు అభ్యంతరం తెలిపారు. ప్రధాన గేటు వద్ద పోలీసులు, మహిళలు నాగసాధును అడ్డుకున్నారు. చివరికి నాగసాధు వస్త్రాలు ధరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. లోక క్షేమం కోసం అమ్మవారి వద్దకు వచ్చానని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నానన్నారు. త్వరలో జరుగనున్న కుంభమేళాకు వెళ్తానని అన్నారు. ఈ పర్యటన ఆసాంతం అఘోరీ నాగసాధును చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు. కొందరు దీవెనల కోసం పోటీపడగా మరికొందరు సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు.

19న వరంగల్‌కు

సీఎం రేవంత్‌రెడ్డి రాక

- పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం
- ఆర్ట్స్ కళాశాలలో విజయోత్సవ సభ
- సీఎం టూర్‌పై హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి సమీక్ష
- నగరంలో ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు


ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్లు, సీపీ, అధికారులు

హనుమకొండ/వరంగల్ కార్పొరేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించనున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 19న వరంగల్ రానున్నారు. సీఎం తన పర్యటనలో భాగంగా రూ.80కోట్లతో హనుమకొండ హయగ్రీవాచారి గ్రౌండ్‌లో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తారు. అలాగే పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. వీటితో పాటు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులతో ఇష్టాగోష్ఠి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారు. సీఎం రేవంత్‌రెడ్డి 19న ఉదయం హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం బాలసముద్రంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తారు. తర్వాత భద్రకాళి ఆలయ మాఢవీధుల అభివృద్ధి పనులు, కాజీపేట వద్ద ఆర్‌వోబీ (బ్రిడ్జి)ని ప్రారంభిస్తారని సమాచారం. మధ్యాహ్నం 12 గంటలకు హనుమకొండ ఆర్ట్సుఅండ్ సైన్స్ కళాశాల మైదానంలో సుమారు లక్ష మంది మహిళలతో మహిళా సాధికారతపై బహిరంగ సభను నిర్వహిస్తారు. ఈ బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి వరంగల్ ఎయిర్‌పోర్టు, మాస్టర్‌ప్లాన్, అండర్‌గ్రౌండ్ డ్రేనేజీ, వరంగల్ పాలిటెక్నిక్ నిర్మాణాలకు నిధులు విడుదల చేస్తారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి అంతేకాకుండా భద్రకాళి చెరువు పూడికతీత పనులను కూడా ముఖ్యమంత్రి పరిశీలించే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యమంత్రితో పాటు పర్యటనలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

విస్తృత ఏర్పాట్లు చేయాలి

సీఎం పర్యటన ఏర్పాట్లకు సంబంధించి శుక్రవారం హైదరాబాద్‌లోని సెక్రెటేరియెట్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సమావేశమై సీఎం పర్యటన రూట్ మ్యాప్, బహిరంగ సభ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు. సీఎం పర్యటన సందర్భంగా ఏడాదికాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయాలు, ముఖ్యంగా స్త్రీ, శిశు సంక్షేమం కోసం అమలు చేసిన కార్యక్రమాలు, పథకాలు ప్రజలకు సవివరంగా తెలిసేలా ఏర్పాట్లు ఉండాలని నరేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. అలాగే 19న వరంగల్‌లో సీఎం పర్యటన గురించి ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో ఆర్అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారుడు శ్రీనివాసరాజు, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఐఅండ్ పీఆర్ కమిషనర్ హరీష్, జిల్లా కలెక్టర్లు, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

ముఖ్యమంత్రి నగర పర్యటన నేపథ్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారదాదేవి, ప్రావీణ్య, వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే నగరంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాక కోసం సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో హెలిప్యాడ్ ఏర్పాటు, ప్రారంభించబోయే బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం, కాజీపేట ఆర్వోబీ (బ్రిడ్జి)ని పరిశీలించారు.

అంతేకాకుండా ముఖ్యమంత్రి పర్యటన రూట్ మ్యాప్‌ను పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు, కుడా, మున్సిపల్ శాఖలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్తీకం.. కమనీయం..

శివుడికి ప్రీతికరమైన కార్తీక పర్వదినం సందర్భంగా జిల్లాలోని ఆలయాలు కిక్కిరిసిపోయాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే శివుడికి ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలతో సందడి కనిపించింది. మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం సమయంలో దీపోత్సవాలు నేత్రపర్వంగా సాగాయి. వత్తులు వెలిగించి ఉసిరి చెట్టు వద్ద పూజలు చేశారు. జనగామ బాణాపురంలో లక్ష దీపాలు, చిల్పూరు, లింగాలగణపురం జీడికల్ తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.


జీడికల్‌లో జీడిగుండం, పాలగుండాల్లో పుష్కరిణి స్నానాలు ఆచరిస్తున్న భక్తులు


జీడికల్ స్వామివారికి వెండి పాత్రను విరాళంగా అందజేస్తున్న భక్తులు నరేందర్‌పద్మ దంపతులు


జనగామ శివాలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు


గీతాశ్రమంలో ఉసిరిచెట్టుకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు


బచ్చన్నపేట సిద్దేశ్వరాలయంలో భక్తుల పూజలు

దేవరుప్పులలోని ఉప్పలమల్లన్న దేవాలయంలో దీపాలు వెలిగించిన భక్తులు




పాలకుర్తి సోమేశ్వరాలయంలో భక్తుల రద్దీ


బండనాగారం రామలింగేశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు


సంతోషిమాత ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


అభయాంజనేయ స్వామి దేవాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు


జఫర్‌గఢ్ శివాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు, మహిళలు

సర్వేను వేగవంతం చేయాలి


సర్వేను పరిశీలిస్తున్న ఘన్‌పూర్ క్లస్టర్ ఇన్‌చార్జ్ యాసర్

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 15: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేబడుతున్న సమగ్ర, కుటుంబ, కుల గణన సర్వేను మరింత వేగిరం చేసేలా చర్యలు చేబడుతున్నామని సమగ్ర సర్వే ఘన్‌పూర్ క్లస్టర్ ఇంచార్జి, ఇరిగేషన్ ఏఈ యాసర్ తెలిపారు. శుక్రవారం ఘన్‌పూర్‌లో జరుగుతున్న సర్వేను ఆయన నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన నిర్ధేశిత లక్ష్యం మేరకు ఎన్యుమరేటర్లు సర్వేను సమర్థవం తంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో నర్సింగరావు, ఈవో చుక్క లింగయ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గాదె భాస్కర్ రెడ్డికి ఘన నివాళులు


భాస్కర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రఘునాథపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గాదె భాస్కర్ రెడ్డి(45) శుక్రవారం గుండె పోటుతో చెందారు. కాంగ్రెస్ నాయకులు ఆయన పార్థీవ దేహంపై కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, మారజోడు రాంబాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, మహేందర్‌రెడ్డి, లోనే శ్రావణ్ కుమార్, మినుముల వెంకట రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అబ్బాస్


నాయకులతో కలిసి సీపీఎం జిల్లా మహా సభల వాల్ పోస్టర్‌లను అవిష్కరిస్తున్న ఎమ్డీ అబ్బాస్

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మత విద్వేశాలు రెచ్చగొడుతూ ప్రజల మధ్య ఐక్యతను దూరం చేస్తున్న బీజేపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎమ్డీ అబ్బాస్ తెలిపారు. శుక్రవారం ఘన్‌పూర్ ముదిరాజ్ కమ్యూనిటీహాల్‌లో సీపీఎం జిల్లా మహసభల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని ప్రైవేట్ కంపెనీలకు అప్పనంగా కేంద్ర ప్రభుత్వం అప్పజెప్పుతుందని మండిపడ్డారు. దేశంలో మతం పేరుతో అలజడులు సృష్టిస్తున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణాన్ని మున్సిపాలిటీగా ప్రకటించాలని, ఘన్‌పూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిసెంబరు 27, 28 తేదిలలో ఘన్‌పూర్ పట్టణంలో జరుగనున్న సీపీఎం జిల్లా మహసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను నాయకులతో కలిసి అవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, సాంబరాజు యాదగిరి, ఇర్రి అహల్య, సోమయ్య, ఎస్. రమేష్, శేఖర్, మునిగెల రమేష్, కొడెపాక యాకయ్య, బూడిద గోపి, కుర్ర ఉప్పలయ్య, చిలుముల్ల భాస్కర్, కత్తుల రాజు, మహేందర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల భూముల జోలికి వస్తే ఊరుకోం

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వామి నాయక్


అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

జనగామ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఫార్మా కంపెనీల పేరుతో గిరిజనుల భూములను లాక్కోవడానికి ప్రయత్నిస్తే ఊరుకునేదని లేదని లంబాడి హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీర స్వామి నాయక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి నాయక్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలోని లెగిచర్ల సమిపంలోని తండాలోని గిరిజనులకు సంబంధించిన భూములను ఫార్మా కంపెనీ పేరుతో ప్రభుత్వం బలవంతంగా భూములను లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా కలెక్టర్‌ను ప్రశ్నించిన వారిపై అక్రమంగా కేసులు నమోదు చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైలుకు తరలించడం జరిగిందన్నారు. గిరిజనుల భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో వాంకుడోతు అనిత, కాలురామ్, రాజేందర్, రాజు, భూక్య చందు, ధరావత్ శంకర్ పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్


మార్కండేయ ఆలయ కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్

చిలుపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి మూడు రోజుల పాటు, నిర్వహించనున్న చిన్నపెండ్యాల మార్కండేయ ఆలయ విగ్రహ ప్రతిష్ఠిత మహోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆలయాన్ని సందర్శించిన ఆయన కమిటీ ప్రతినిధులతో మాట్లాడారు. చిన్నపెండ్యాల - తరిగొప్పుల ప్రధాన రహదారికి ఆనుకుని మార్కండేయ ఆలయం ఉన్నందున వాలంటీర్లను ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. డీజేల వినియోగానికి అనుమతి లేదని తెలిపారు. గ్రామస్థులు సహకరించాలని కోరారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. రాత్రుళ్ళు పర్యవేక్షణ ఉండాలని నిర్వాహకులను ఆదేశించారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బత్తుల రాజన్‌బాబు, పేరాల రాజమౌళి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కడియంపై ఆరోపణలు సరికావు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 15: మాజీ ఎమ్మెల్యే రాజయ్య కడియం శ్రీహరి పై చేసిన ఆరోపణలు సరికావని, ప్రభుత్వ భూమి కబ్జా చేసినందుకే డిప్యూటీ సీఎం పదవి ఊడిందని బ్లాక్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య ఆరోపించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఘన్‌పూర్, జఫర్‌గడ్, చిలుపూరు మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకుల తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎల్లయ్య మాట్లాడారు. నీతి, నిజాయితికి మారుపేరుగా చెప్పుకునే ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుటుంబ సభ్యుల పైన నిరాధారమైన భూకబ్జా ఆరోపణలు చేయడం రాజయ్య అవివేకానికి నిదర్శనమన్నారు. 15 ఏళ్లపాటు ఎమ్మెల్యేగా రాజయ్య అనేక అవినీతి, భూకబ్జాలకు పాల్పడ్డాడని తెలిపారు. దళితుడని చెప్పుకునే రాజయ్య దళితబంధు పేరుతో నిరుపేద దళితుల వద్ద నుంచి రూ.లక్షలు కమీషన్లు తీసుకొని వారి కుటుం బాలను రోడ్డున పడేశాడని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య రెడ్డి, రైసు మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, మార్కెట్ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, ఘన్‌పూర్, చిలుపూరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, గడ్డమీది సురేష్, జిల్లా నాయకులు బానోతు రాజేష్‌నాయక్, బూర్ల శంకర్, కోతి రాములు, అంబటి కిషన్‌రాజ్, కొలిపాక సతీష్, చింత ఎల్లయ్య, సింగపురం వెంకటయ్య, గట్టు మనోహర్, చేరాలు పాల్గొన్నారు.

ప్రజల చేతిలో రాజయ్యకు గుణపాఠం తప్పదు


సమావేశంలో మాట్లాడుతున్న లింగాల జగదీష్ చందర్ రెడ్డి

రఘునాథపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం కోసం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సేవ చేయడమే లక్ష్యంగా ఎంచుకుని అహర్నిశలు అంకిత భావంతో పని చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నిరాధారమైన ఆరోపణలకు పాల్పడడం ఆయన దివాళ కోరుతనానికి నిదర్శనమని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్‌రెడ్డి మండిపడ్డారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు మాజీ జడ్పీటీసీ మారజోడు రాంబాబు మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరి సంపూర్ణ అభివృద్దే ధ్యేయంగా పని చేస్తున్న కడియం శ్రీహరి పని తీరు చూసి ఓర్వలేకనే రాసలీల రాజయ్య అసత్య ఆరోపణలు చేస్తున్నారని, రాజయ్య నిజ స్వరూపం నియోజకవర్గ ప్రజలందరికి తెలుసునన్న విషయాన్ని ఆయన గమనించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో గల ఇనుప రాతి గుట్టలను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి కడియం శ్రీహరి అల్లుడు కాజేయాలని చూస్తున్నా డని రాజయ్య ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. రాజయ్య ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దళితబంధు పథకం మంజూరు కావడానికి దళితుల ఒక్కొక్కరి నుండి రూ.2 లక్షలు లంచం తీసుకున్న నీ చరిత్రను కప్పిపుచ్చుకోవడానికి కడియంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రినని గొప్పలు చెప్పుకుంటున్న తాను తెలంగాణలో భర్తరఫ్ అయిన తొలి ఉప ముఖ్యమంత్రి అనే విషయాన్ని మర్చిపోవద్దని తెలిపారు. కడియం శ్రీహరిపై బురదజల్లే ప్రయత్నం చేస్తే ప్రజల చేతిలో తగిన గుణపాఠం తప్పదు.. ఖబర్దార్ అని హెచ్చరించారు. గుట్టలు ఆక్రమించినట్లు ఆధారాలు ఉంటే ప్రజా క్షేత్రంలోకి వచ్చి బహిరంగంగా బయటపెట్టాలని, దీనికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందని, దమ్ము, ధైర్యం ఉంటే బహిరంగ చర్చకు సిద్ధం కావాలని రాజయ్యకు సవాల్ విసిరారు. సమావేశంలో జిల్లా నాయకులు మేకల నరేందర్, ఎండి.బాషుమియా, లోనే శ్రావణ్, తాటికొండ వెంకటేష్ యాదవ్, మార్కెట్ డైరెక్టర్లు తోటకూరి రమేష్, బంద కుమార్, నాయకులు కావటి భాస్కర్, కడారి రవి, కరుణాకర్, వెంకట రెడ్డి, మల్లేష్, అరూరి శ్రీనివాస్, మహేందర్, కిరణ్, యాదగిరి, వడ్లకొండ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామీణ క్రీడోత్సవాలు

జనగామ కల్చరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గాను జిల్లా యువజన, క్రీడల శాఖ నేతృత్వంలో, ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి గ్రామీణ క్రీడోత్సవాలు నిర్వహించనున్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో శనివారం 16న పురుషులకు వాలీబాల్, 17న మహిళలకు త్రోబాల్ నిర్వహిస్తారు. వాలీబాల్ క్రీడలో మొదటి బహుమతిగా రూ.9వేలు, రెండవ రూ.6 వేలు, మూడవ రూ.3 వేలు, నాల్గవ బహుమతిగా రూ.2 వేలు, త్రోబాల్ క్రీడలో ప్రథమ బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయ రూ.3 వేలు, తృతీయ రూ.2 వేలు, నాల్గవ బహుమతిగా రూ.1500.లు ప్రైజ్ మనీ అందించనున్నారు. ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచినవారు హైదరాబాద్‌లో నిర్వహించే డివిజనల్ క్రీడల్లో పాల్గొంటారని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దేవరుప్పుల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమడూరు గ్రామ వాగునుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను దేవరుప్పుల పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని, ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పునఃప్రతిష్ఠ హోమానికి ఆర్థిక సాయం

దేవరుప్పుల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమడూరు గ్రామంలో శ్రీకంఠమహేశ్వరస్వామి పోతురాజు పునఃప్రతిష్ఠ, హోమం ఈనెల 17న జరుగనున్న కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా నాయకులు బబ్బూరి శ్రీకాంత్ ఆర్థికసాయం అందించారు. అదే విధంగా ఆదివారం రోజున అన్నదాన కార్యక్రమం కూడా బబ్బూరి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు శ్రీకాంత్ వెల్లడించారు. గ్రామానికి చెందిన చిన్న గుంటి గౌడ, పెద్దగుంటి గౌడల సహకారంతో పురోహితులు శ్రీకాంత్‌శర్మ పోతరాజుల పునః ప్రతిష్ఠ, మహాయజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమానికి గౌడ సామాజిక వర్గం, ప్రముఖులు, గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి దివ్య ఆశీస్సులు పొంది అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

బాల్యమిత్రుల చేయూత


సుస్మితకు బుక్ అందజేస్తున్న బాల్య మిత్రులు

పాలకుర్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఈర వెన్ను గ్రామానికి చెందిన గోరంతల భాస్కర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరం లో చదువుకున్న బాల్య మిత్రులు కలిసి మృతుడు చిన్న కూతురు సుస్మిత పేరు పై పోస్టాఫీసులో రూ. 70 వేలు ఫిక్సడ్ డిపాజిట్ చేసి పాసు పుస్తకాన్ని బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆకుటు ంబానికి అండగా ఉంటామని, అన్ని విధాలుగా ఆదుకుంటామని బాల్య మిత్రులు తెలిపారు. అదే విధంగా మండలంలోని గుడికుంట తండా గ్రామానికి చెందిన బానోతు నరేష్ మృతి చెందగా చెన్నూరు పాఠశాలలో 2012-2013లో కలిసి చదువుతున్న బాల్య మిత్రులు నరేష్ కూతురు సారిక పేరుపై రూ. 25 వేలు పోస్టాఫీసులో స్థిరనిధి ఖాతా పుస్తకాన్ని మృతుడి భార్యకు అందజేశారు. కార్యక్రమంలో సాజిద్, అశోక్, రాజు, అశోక్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపిక

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక శివునిపల్లి హైస్కూల్ విద్యార్థులు బేస్ బాల్ పోటీల్లో జిల్లా స్థాయి 68వ ఎస్‌జీఎఫ్ పోటీల్లో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం కె.రమేశ్, పీడీ కె.రవి తెలిపారు. రాష్ట్ర స్థాయి బేస్ బాల్ జూనియర్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు డి.చరణ్, జి.మధుసూదన్(9వ తరగతి), బానోతు మణి(టెన్త్)లను శుక్రవారం వారు అభినందించారు. వీరు ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్మల్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొనబోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు రాణించి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ జి.రాధిక, పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు జొన్నల రాజేశ్వర్ రావు, యంజాల ప్రభాకర్, ఎస్.వెంక ట్రామనర్సయ్య, దస్తగిరి, పి.సోమశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.